సాక్షి
కాకినాడ
బుధవారం | 5 | మార్చి | 2025



రూ.1,00,116 విరాళం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి కొళ్లకూరి కృష్ణప్రకాష్ కుటుంబ సభ్యులు (అమెరికా) మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



9,450 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులుగా ఉంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహర్ గురువారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.58
కాకినాడ	6.20	4.57
అమలాపురం	6.20	4.57

కౌలు కోలేక..



- గుర్తింపుతో సరి.. రుణాలేవీ మరి!
- పట్టించుకోని కూటమి సర్కారు
- కౌలు రైతులకు అందని పథకాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కూటమి ప్రభుత్వ హయాంలో తమకు తీరని అన్యాయం జరుగుతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగ మాదిరిగా ఉండేది. గ్రామ స్థాయిలో విత్తనాలు మొదలుకొని ధాన్యం అమ్మకాల వరకూ రైతులకు వారి చెంతనే సేవలు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయంపై నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని చెబుతున్నారు. అన్నదాతా సుఖీభవ పేరిట ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం హామీని గాల్లో కలిపేశారు. మరోవైపు కౌలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు.

గుర్తింపు కార్డులతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఖరీఫ్‌లో కౌలు రైతుల గుర్తింపులో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ఎట్టకేలకు జిల్లాలో 35 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. కానీ వారికి ప్రభుత్వం నుంచి ఒక్క పథకం కూడా దక్కలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారంతో పాటు బ్యాంకుల్లో రుణాలు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం ఖరీఫ్ ముగిసి, రబీ సీజన్ కూడా మొదలై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ కౌలు రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం కానీ, ఎరువులు, విత్తనాలు, రుణాలు ఇవ్వడం లేదు.

కౌలు రైతులపై రుణపాశం

ప్రస్తుతం ఎకరా భూమికి యజమానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ కౌలు చెల్లించాల్సి వస్తోంది. ఆ మొత్తం చెల్లించిన అనంతరమే కౌలు రైతులు సాగు చేపడుతున్నారు. దీనికి తోడు విత్తనాల కొనుగోలు మొదలు, పంట దమ్ము, వరి నాట్లు, ఎరువులు, పురుగు మందుల వంటి వాటికి మరో రూ.25 వేలు పైగా పెట్టుబడి అవుతోంది. మొత్తం మీద ఎకరం భూమి కౌలుకు చేయాలంటే రూ.50 వేల వరకూ అవసరం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు గుర్తింపు కార్డు ఉన్న ప్రతి రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఎటువంటి హామీ లేకుండా పంట రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం గుర్తింపు కార్డులు ఇచ్చినా ఎటువంటి రుణాలూ ఇవ్వకుండానే చేతులు దులుపుకొన్నారు. గత్యంతరం లేక కౌలు రైతులు బయటి వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పడిన శ్రమంతా కౌలుకు, పెట్టుబడులు, వడ్డీలకే పోతోందని, తమకు మిగులుతున్నదేమీ ఉండటం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కనీసం ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తే తక్కువ వడ్డీ కావడంతో కనీసం ఆ మొత్తమైనా మిగిలేదని అంటున్నారు. గత ప్రభుత్వంలోనే తమకు ఎంతో మేలు జరిగిందని, ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు.



యు.కొత్తపల్లి మండలంలో కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందిస్తున్న అధికారులు (ఫైల్)

నాలుగేళ్లుగా జిల్లాలో మంజూరు చేసిన కౌలు కార్డులు, కౌలు రైతులకిచ్చిన రుణాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	కౌలు కార్డులు	రుణాలు
2020-21	36,795	18.73
2021-22	44,580	47.17
2022-23	41,322	46.46
2023-24	56,399	53.80

పరిహారం.. పరిహాసం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ అమలు చేసేవారు. వైఎస్సార్ రైతు భరోసా కింద నిరుపేద ఎస్సీ, బీసీ కౌలు రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు పెట్టుబడి సాయం జమ చేశారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బ తింటే కౌలు రైతులకు కూడా నష్ట పరిహారం అందించేవారు. గత ఏడాది అధిక వర్షాలకు భారీగా పంట నష్టం జరిగినా కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం ఎక్కడా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. భూమి సర్వే నంబర్ల ఆధారంగా ప్రతి ఎకరాకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం జమ చేసింది. ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు భూమి యజమానులు ససేమిరా అనడంతో కౌలు రైతులు నిండా మునిగారు.

రుణాలిచ్చి ఆదుకోవాలి



ఈ ఏడాది కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలివ్వలేదు. బయటి వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని తొలకరి సీజన్‌లో ఇబ్బందులు పడ్డాం. కనీసం దాళ్వాలోనైనా బ్యాంకు రుణాలిప్పించాలి. లేకుంటే కౌలు రైతులు సాగు చేయడం కష్టమే.

– రాయుడు శ్రీనివాస్, కౌలు రైతు, యండమూరు, కరప మండలం

కౌలు రైతులను పట్టించుకోవడం లేదు



ఈ ప్రభుత్వం కౌలు రైతులను అసలు గుర్తించడం లేదు. ఎటువంటి సహాయమూ చేయడం లేదు. గత ప్రభుత్వం కౌలు రైతులను ఎంతగానో ఆదుకొంది. గుర్తింపు కార్డులివ్వడమే కాకుండా బ్యాంకుల ద్వారా పంట రుణాలు కూడా ఇచ్చింది.

– తుమ్మల అచ్చియ్య, కౌలు రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

న్యూస్‌రీల్

రూ.1.60 కోట్లతో రత్నగిరిపై అభివృద్ధి పనులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో రూ.1.60 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రూ.40 లక్షలతో రెండో ఘాట్ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణం, రూ.1.20 కోట్లతో న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాలు, ప్రకాష్ సదన్ సత్రాల గదుల మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలవనున్న నేపథ్యంలో దేవదాయ శాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు, చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్ తదితరులు ఆయా సత్రాలను మంగళవారం సందర్శించి, పనుల ఆవశ్యకతను పరిశీలించారు. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారు. మిగిలిన మూడింటికీ టెండర్లు పిలవాల్సి ఉంది. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, డీఈలు రాంబాబు, గుర్రాజు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాల్లో తనిఖీలు



ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో పార్సిళ్లను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

కాకినాడ క్రైం: బాణసంచా అక్రమ తరలింపు నేపథ్యంలో సోమవారం కాకినాడలో చోటు చేసుకున్న పేలుడుతో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. నగరంలోని పలు కొరియర్, ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పార్శిళ్లను బాంబ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేస్తోంది. సంస్థ యాజమాన్యాలకు బాణసంచా, ఇతర పేలుడు పదార్థాలు, రసాయనాలు, మాదక ద్రవ్యాలు బుక్ చేయొద్దంటూ ఆదేశాలు ఇచ్చారు. అనుమానాస్పద పార్సిళ్లను గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షలు జిల్లాలో మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు 21,502, మంది హాజరు కాగా, 732 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,673 మంది హాజరవగా 135 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి నూకరాజు తెలిపారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణ



పరికరాల గురించి వివరిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కార్యాలయంలో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) సిబ్బందికి రెండు వారాల శిక్షణను కమాండెంట్ ఎం.నాగేంద్రరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఎస్‌డీఆర్‌ఎఫ్ పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. ఆపదలో ఉన్నవారిని ముందుండి రక్షించే లక్ష్యంతో తొలిసారిగా మూడో బెటాలియన్‌లోనే ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను ప్రారంభించారని తెలిపారు. కమాండెంట్ నాగేంద్రరావు మాట్లాడుతూ, తిత్లీ తుపాను, దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద బోటు బోల్తా, ఇటీవల విజయవాడ సింధు నగర్ అర్బన్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాద ఘటనల్లో ఏపీఎస్పీ మూడో బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మంచి ప్రతిభ చూపారన్నారు. ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రత్యేకంగా రివార్డులు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తాము ఉపయోగించే వివిధ పరికరాలను కమాండెంట్‌కు చూపించి, వాటి పని తీరును వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు మోహన్‌రావు, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాదగయకు రూ.11.75 లక్షల ఆదాయం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం హుండీని మంగళవారం తెరచి ఆదాయం లెక్కించారు. సీఎస్ఓ సీహెచ్ రామ్మోహనరావు, ఇన్‌స్పెక్టర్లు వడ్డి ఫణీంద్ర కుమార్, జోగా సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని 17 రోజులకు గాను హుండీల ద్వారా రూ.11,74,660 ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు.

హాకీ జట్టు ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక స్థానిక జిల్లా క్రీడా మైదానంలో మంగళవారం జరిగింది. జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ ఎంపికలకు 25 మంది హాజరయ్యారు. డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర పర్యవేక్షణలో 18 మందిని జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే అంతర్ జిల్లాల హాకీ పోటీలో పాల్గొంటారు. ఈ జట్టుకు కోచ్‌గా దుర్గాప్రసాద్, మేనేజర్‌గా బాబ్జీ వ్యవహరిస్తారని హాకీ సంఘం ప్రతినిధి రవిరాజు తెలిపారు.

'మన మిత్ర' నుంచి టెన్త్ హాల్ టికెట్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను మన మిత్ర వాట్సాప్ (వాట్సాప్ గ్రీవెన్స్) ద్వారా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు మన మిత్ర వాట్సాప్ యాప్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేయవచ్చునని తెలిపారు. అభ్యర్థులు తమ వాట్సాప్ ద్వారా 95523 00009 నంబర్‌కు హాయ్ అనే సందేశం పంపించి, సేవ, పదో తరగతి హాల్ టికెట్ ఎంపిక చేసుకోవాలన్నారు. అనంతరం అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే హాల్ టికెట్ డౌన్‌లోడ్ అవుతుందని డీఈఓ వాసుదేవరావు తెలిపారు.

సత్రం భవన నిర్మాణంపై సందిగ్ధం



సీతారామ సత్రాన్ని పరిశీలిస్తున్న కొండలరావు, సీఈ శేఖర్, అధికారులు

- పరిశీలించిన అధికారులు
- మరమ్మతులకు అవకాశాలను పరిశీలించాలన్న నిపుణులు
- ఇప్పటికే రూ.11.40 కోట్లతో కొత్త సత్రం నిర్మాణానికి టెండర్లు
- నిపుణుల సలహాతో డోలాయమానం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో రూ.11.40 కోట్లతో నిర్మించనున్న శ్రీ సీతారామ సత్రం (ఎస్ఆర్‌సీ) నిర్మాణం సందిగ్ధంలో పడింది. దీని టెండర్లను ఒకటి రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉండగా.. మంగళవారం దేవదాయ శాఖ సాంకేతిక సలహాదారు పి.కొండలరావు, చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్, సాంకేతిక కమిటీ సభ్యులు దేవస్థానానికి వచ్చారు. ఈ సత్రాన్ని పడగొట్టి కొత్త భవనం నిర్మించేకన్నా పాత భవనానికి మరమ్మతులు చేసే విషయం పరిశీలించాలని సూచించారు. అయితే, పాత సత్రాన్ని కూల్చివేసి ఇనుము, కలప తీసుకువెళ్లడానికి, సత్రం కూల్చివేయగా వచ్చిన వ్యర్థాలను బయటకు తరలించడానికి గాను దేవస్థానానికి రూ.4.50 లక్షలు చెల్లించేలా టెండర్ ఇప్పటికే ఖరారైంది. ఈ పరిస్థితుల్లో పాత భవనానికి మరమ్మతులు చేయాలంటూ నిపుణులు, ఉన్నతాధికారులు చేసిన సూచనలతో స్థానిక అధికారులు డోలాయమానంలో పడ్డారు.

గతంలోనే నిర్ణయం

రత్నగిరిపై భక్తుల వసతి గదుల సమస్య పరిష్కారానికి గాను సీతారామ సత్రం స్థలంలో రెండు బ్లాకులతో నూతన భవనం నిర్మాణానికి గత ఏడాదే ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు అప్పట్లో అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన ప్రస్తుత దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. శిథిలావస్థకు చేరిన పాత సత్రాన్ని కూల్చివేయాలంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ఆ నిర్ణయం తీసుకున్నారు. నూతన సత్రాన్ని రెండు దశల్లో నిర్మించాలని నిర్ణయించారు. తొలి దశలో దక్షిణం వైపు నాలుగంతస్తుల్లో 105 గదులతో బ్లాక్–ఎ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ పరిపాలనా అనుమతులు కూడా మంజూరు చేశారు. ఈ మేరకు గత జనవరిలో టెండర్లు పిలిచారు. గ్రౌండ్ ఫ్లోర్ వాహనాల పార్కింగ్‌కు వదిలేయాలని, 1, 2, 3 అంతస్తుల్లో ఫ్లోర్‌కు 35 చొప్పున 105 గదులు నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి 12 మంది కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఈ వారంలో ఖరారు చేయాలని నిర్ణయించారు. ఈ పరిస్థితుల్లో దేవదాయ శాఖ అధికారులు, నిపుణులు పాత సత్రాన్ని కూల్చకుండా తాత్కాలిక మరమ్మతులు చేయిస్తే ఇంకో పదేళ్లు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సత్రంలో కొన్ని గదులు వర్షానికి కారిపోతున్నాయని చెప్పగా.. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో లీకేజీలు అరికట్టాలని సూచించారు. రూ.11.40 కోట్లతో మరోచోట సత్రం 105 గదుల సత్రం నిర్మించాలని చెప్పారు. దీంతో సీతారామ సత్రం నూతన భవనం నిర్మాణంపై సందిగ్ధత ఏర్పడింది. ఈ విషయాన్ని కమిషనర్ రామచంద్ర మోహన్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం, డీఈలు గుర్రాజు, రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేరాబత్తుల విజయం



ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

- 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు
- పీడీఎఫ్ అభ్యర్థికి 47,241 ఓట్లు
- 8 రౌండ్లలో ముగిసిన ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్య ప్రధానంగా పోటీ జరిగింది. మరో 33 మంది స్వతంత్రులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఎన్నికల్లో పేరాబత్తుల తన సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొదట ప్రాధాన్య ఓట్లు 50 శాతం పైచిలుకు సాధించడంతో ఆయనను విజేతగా ప్రకటించారు. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకూ బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను కట్టలు కట్టడానికే సమయం సరిపోయింది. 28 టేబుల్స్ ఏర్పాటు చేసి 17 రౌండ్లు నిర్వహించేలా కట్టలు కట్టారు. ఎట్టకేలకు రాత్రి 10 గంటలకు కౌంటింగ్ ప్రారంభించారు. ప్రతి టేబుల్‌కు వెయ్యి చొప్పున సగటున ప్రతి రౌండ్‌లో 28 వేల ఓట్లు లెక్కించి, 8 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను ముగించారు. మొత్తం 2,18,997 ఓట్లు పోలవగా వాటిలో 19,789 ఓట్లు చెల్లనివిగా నిర్ధారించారు. మిగిలిన 1,99,208 ఓట్లను లెక్కించారు. ప్రతి రౌండ్‌లోనూ కూటమి అభ్యర్థి ఆధిక్యం కొనసాగింది. మొదటి రౌండ్‌లో 28 వేల ఓట్లు లెక్కించగా కూటమి అభ్యర్థికి 16,520, పీడీఎఫ్ అభ్యర్థి 5,815 చొప్పున ఓట్లు దక్కాయి. ఎనిమిది రౌండ్లు కలిపి టీడీపీ అభ్యర్థికి 1,24,702 మొదటి ప్రాధాన్య ఓట్లు రాగా.. పీడీఎఫ్ అభ్యర్థి 47,241 ఓట్లు దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, మెరుగైన ఓట్లు సాధించారు. ఎనిమిది రౌండ్లలో ఆయనకు 16,183 ఓట్లు దక్కాయి. మిగిలిన అభ్యర్థులు తక్కువ ఓట్లతో సరిపెట్టుకున్నారు. విజేత పేరాబత్తులకు రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ధ్రువీకరణ పత్రం అందించారు.

వేసవిలో విద్యుత్ సమస్యలపై దృష్టి



లైన్‌మన్లను సత్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్ తదితరులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వేసవిలో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, కోనసీమకు 6 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయిస్తామని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. అమలాపురం మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ఓవర్ లోడ్‌ను గుర్తించి అందుకు తగిన యాక్షన్ ప్లాన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్యానల్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, వినియోగదారులకు చౌకగా సోలార్ విద్యుత్ అందించే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు నల్లవంతెన వద్ద అనువైన భవనాలను పరిశీలించారు. తొలుత ఈదరపల్లిలోని విద్యుత్ కార్యాలయం వద్ద లైన్‌మెన్ దివస్ కార్యక్రమంలో లైన్‌మన్లను సత్కరించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రాజబాబు, టెక్నికల్ డీఈ ఎస్.నాగేశ్వరరావు, ఈఈలు కె.రాంబాబు, కె.రత్నాలరాజు, అకౌంట్ ఆఫీసర్ సత్యకిషోర్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కాకినాడకు మినీ రెస్క్యూ టెండర్లు

- హజ్మత్ వాహనం కూడా త్వరలో మంజూరు
- అగ్నిమాపక శాఖ ఏడీ శ్రీనివాసులు

కాకినాడ క్రైం: కాకినాడ పరిధిలో అగ్నిప్రమాదాలతో పాటు నీటి వనరులు ఎక్కువగా ఉండటంతో జల ప్రమాదాలకు సంబంధించిన కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని రాష్ట్ర అగ్నిమాపక శాఖ నార్త్ రీజియన్ అదనపు డైరెక్టర్ జి.శ్రీనివాసులు తెలిపారు. వీటి నిర్వహణకు గాను కాకినాడకు మినీ రెస్క్యూ టెండర్లు మంజూరు చేస్తామని చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన స్థానిక వివేకానంద పార్క్ ఎదురుగా ఉన్న జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంతో పాటు, సాలిపేట ఫైర్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది కార్యకలాపాలు, పరికరాలు, స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సహాయ ఫైర్ అధికారి వి.సుబ్బారావును అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, మినీ రెస్క్యూ టెండర్లలో ప్రత్యేక నైపుణ్యంతో కూడిన సిబ్బందితో పాటు అవసరమైన పరికరాలు ఉంటాయని చెప్పారు. జిల్లాలో పరిశ్రమలు అధికమని, రసాయనాల వల్ల అనుకోని దుర్ఘటనలు జరిగితే ప్రాణ నష్టాన్ని ఊహించలేమని అన్నారు. అటువంటి రసాయన ప్రమాదాల నివారణకు గాను త్వరలో కాకినాడకు హజ్మత్ వాహనాన్ని కేటాయించనున్నామని తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే తక్షణమే బయట పడేందుకు అక్కడి భద్రతా సిబ్బందికి ప్రత్యేక రెస్క్యూ శిక్షణ ఇస్తామని శ్రీనివాసులు తెలిపారు. దీనికోసం స్థానిక జగన్నాథపురంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ప్రత్యేక శిక్షణా విభాగం ఏర్పాటు చేస్తామని చెప్పారు. దట్టమైన పొగలో సిబ్బంది ఎటువంటి ప్రమాదానికీ గురి కాకుండా త్వరలో జిల్లాకు బ్రీతింగ్ ఆపరేటర్లు ఇస్తున్నామని తెలిపారు. సాలిపేట అగ్నిమాపక కార్యాలయానికి త్వరలో కొత్త భవనం నిర్మాణం ప్రారంభం కానుందన్నారు. దీనికి అన్ని అనుమతులూ పూర్తయ్యాయని వెల్లడించారు. జగన్నాథపురం ఫైర్ స్టేషన్లో నిర్మాణం, మరమ్మతు పనులు పూర్తి చేసేందుకు మంగళవారం టెండర్లు పిలిచామని శ్రీనివాసులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి పీవీఎస్ రాజేష్, ఏడీఎఫ్‌వో సుబ్బారావు కూడా పాల్గొన్నారు.



వివిధ పరికరాలు వినియోగించే విధానాన్ని సిబ్బందికి వివరిస్తున్న ఏడీ శ్రీనివాసులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఆశాభంగం



డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అమలాపురంలో ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

- ఆశా కార్యకర్తలను నయవంచన చేస్తున్న ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీలో వేతనం రూ.పది వేలకు పెంపు
- రేపు చలో విజయవాడకు పిలుపునిచ్చిన సీఐటీయూ
- పోలీసు కేసులకు, వేధింపులకు భయపడేది లేదు

ఆలమూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతకు అహర్నిశలు శ్రమిస్తున్న ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు దీర్ఘకాలిక డిమాండ్లు పరిష్కరిస్తామన్న కూటమి ప్రభుత్వం హామీ నీటి మూటగా మారింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అలవి కాని హామీలిచ్చి అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలు మాదిరిగానే ఆశా కార్యకర్తలను కూడా నయవంచనకు గురిచేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 9నెలలు అయినా ఇంకా హామీలు అమలు చేయకపోవడంతో రాష్ట్ర ఆశా కార్యకర్తల సమాఖ్య పిలుపు మేరకు గత ఏడాది నవంబర్ 18న ఆశా కార్యకర్తలు జిల్లా కేంద్రమైన అమలాపురంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద తమ నిరసనలను తెలియజేశారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం ఆశా కార్యకర్తల డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిష్కారిస్తామని ఆ సమయంలో హామీ ఇచ్చింది. ప్రభుత్వం మాట తప్పిన వైనాన్ని జీర్ణించుకోలేని ఆశా కార్యకర్తలు తాడోపేడో తేల్చుకునేందుకు ఈ నెల ఆరవ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. దీంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలీసులు ధర్నాకు వెళ్లే వారిని గుర్తించే పనిలో నిమగ్నమై బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనుకాడవద్దని ఆశా కార్యకర్తలు తీర్మానించుకున్నారు.

ఆశా కార్యకర్తలపై పెరిగిన పని ఒత్తిడి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనున్న 56 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రస్తుతం 1395 మంది ఆశా కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి జనాభాకు ఒక ఆశా కార్యకర్తను ప్రభుత్వం నియమించవలసి ఉంది. జిల్లాలో 2011 జనాభా గణాంకాల ప్రకారం 17.19 లక్షల మంది జనాభా ఉండగా ఆశా కార్యకర్తలను దాదాపు 1,700 మందిని నియమించవలసి ఉంది. ప్రస్తుతం వివిధ కారణాల రీత్యా ఖాళీ అయిన ఆశా కార్యకర్తల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. దీంతో ప్రస్తుతం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలపైనే అదనపు భారం పడుతోంది. రోజు రోజుకు ప్రవేశపెడుతున్న యాప్‌లతో పాటు పని ఒత్తిడితో ఆశా కార్యకర్తలు సతమతమవుతున్నారు. దైనందిన జీవితంలో నిత్యవసరాల ధరలతో పాటు ఖర్చులు పెరిగినట్లుగా వేతనం పెరగక ఆశా కార్యకర్తలు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

నాటి వైఎస్సార్ సీపీ సర్కారులో స్వర్ణయుగం

2019–24 మధ్య కాలంలో పాలించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంది. చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం అనుభవించిన ఆశా కార్యకర్తలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు చేసిన పాదయాత్రలో ఆశా కార్యకర్తల దుస్థితిని గుర్తించారు. అందుకనుగుణంగా వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే అప్పటి వరకూ రూ.మూడు వేలు ఉన్న వేతనాన్ని ఒక్కసారిగా 2019 ఆగస్టు 12న రూ.పది వేలకు పెంచారు. ఆశా కార్యకర్తల కులం, మతం, ప్రాంతం, వర్గం చూడకుండా సజావుగా విధులు నిర్వహించేందుకు భరోసా కల్పించారు. నేటి రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పోల్చుకుంటున్న ఆశా కార్యకర్తలు నాటి స్వర్ణయుగాన్ని తలుచుకుంటున్నారు.

ప్రభుత్వం ప్రకటించిన వరాలు పనికిరావు

జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నా హడావుడిగా ఆశా కార్యకర్తలను సంతృప్తి పరచేందుకు పలు రాయితీలను అందిస్తుందంటూ ప్రభుత్వం ఇచ్చిన లీకేజీల వల్ల ఆశా కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. 2006లో పూర్తి స్థాయిలో ఆశా కార్యకర్తలను పోస్టులు భర్తీ చేయగా మధ్యలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసుకుంటూ వచ్చారు. గత పదేళ్ల నుంచి ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన ప్రసూతి సెలవులు ఉపయోగించుకొనే అవకాశం లేదని ఆశా కార్యకర్తలు చెబుతున్నారు. గ్రాడ్యుటీని ప్రవేశపెట్టి రూ.1.50 లక్షలు పదవీ విరమణ అనంతరం ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటన కూడా బూటకమని వారు చెబుతున్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు ఉంటేనే గ్రాడ్యుటీ అమలు చేస్తామని మెలిక పెట్టడం ఆశా కార్యకర్తలను వంచించడమేనని మండిపడుతున్నారు. వేతనాల పెంపు లేకుండా కేవలం పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంలో ఆశా కార్యకర్తలకు ఒరిగేదేమీ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యాయబద్ధమైన డిమాండ్లు అంగీకరించాలి



రాష్ట్ర ప్రభుత్వం గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఆశా కార్యకర్తల న్యాయబద్ధమైన డిమాండ్లను అంగీకరించాలి. ఏఎన్ఎంలుగా పదోన్నతికి అవకాశం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఆశా కార్యకర్తల డిమాండ్లను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి.

– కె.కృష్ణవేణి, కోనసీమ జిల్లా ఆశా కార్యకర్తల సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు

ఆశా కార్యకర్తల డిమాండ్లు ఇవీ

- కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలి.
- ఒప్పంద జీవోలన్నింటిని విడుదల చేయాలి.
- ఏఎన్ఎం శిక్షణ పొందిన వారందరికి పర్మినెంట్ పోస్టుల భర్తీ సమయంలో తగిన ప్రాధాన్యం కల్పించాలి.
- అర్హతను బట్టి దశల వారీగా ఏఎన్ఎం శిక్షణను ఇచ్చి ధ్రువపత్రాలను మంజూరు చేయాలి.
- ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో ప్రకటించిన వాటి కంటే అధికంగా నిధులు పెంచాలి. ఆరోగ్య భద్రతా చట్టం చేయాలి.
- ప్రతి యేటా రెండు జతలకు యూనిఫామ్ అలావెన్స్ ఇవ్వాలి.
- లెప్రసీ సర్వేకు సంబంధించిన పారితోషికాలు వెంటనే చెల్లించాలి.

క్లుప్తంగా

ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేసినందుకు భారీ వడ్డన

కాకినాడ వినియోగదారుల కమిషన్ తీర్పు

కాకినాడ లీగల్: కాకినాడ రూరల్ గంగానపల్లికి చెందిన నున్నా కుసుమ కళ్యాణ్ 2023 డిసెంబర్ 8వ తేదీన హైదరాబాద్ బోడుప్పల్ ప్రాంతాంలో ఉన్న హోటల్ ట్యూలిప్స్ గ్రాండ్ ద్వారా బిరియానీలు, డ్రింకులు, మూడు మినరల్ వాటర్ బాటిల్స్ జొమాటో డైనింగ్ పే ద్వారా కొనుగోలు చేశాడు. అయితే వాటికి రూ.3,083 చెల్లించాడు. అయితే హోటల్ వారు రూ.20 ఎమ్మార్పీ ఉన్న వాటర్ బాటిల్ ఒక దానికి రూ.29 బిల్లు వేశారు. అయితే మూడు వాటర్ బాటిల్స్ రూ. 60 అయితే అదనంగా 27 వసూలు చేయగా మొత్తం మూడు వాటర్ బాటిల్స్‌కు 87 చెల్లించాడు. కళ్యాణ్ హోటల్ వారిని ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. వినియోగదారుల పరిరక్షణ చట్టం ప్రకారం న్యాయవాది ద్వారా నోటీసులు పంపగా హోటల్ వారు స్పందించకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ తీర్పులో కుసుమ కళ్యాణ్‌కు రూ.25వేల నష్టపరిహారంతోపాటు రూ.2వేల కోర్టు ఖర్చులు ఇవ్వాలని, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.27లక్షలు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. కాకినాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ మేరకు తీర్పు చెప్పారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నం

- వాటర్ ట్యాంక్ ఎక్కిన బి.ఫార్మసీ విద్యార్థిని
- గంటన్నర సేపు పోలీసులు, స్థానికుల్లో ఉత్కంఠ
- ఎట్టకేలకు విద్యార్థిని ట్యాంక్ దిగడంతో కథ సుఖాంతం



వాటర్ ట్యాంక్ వద్దకు చేరిన స్థానికులు

అమలాపురం టౌన్: ఉప్పలగుప్తానికి చెందిన బి.ఫార్మసీ చదువుతున్న విద్యార్థిని అమలాపురంలో వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, స్థానికులకు ముచ్చెమటలు పట్టించింది. అమలాపురం గాంధీనగర్ శివారులో నిర్మాణం పూర్తయి ఇంకా ప్రారంభం కాని దాదాపు 60 అడుగుల ఎత్తు ఉన్న వాటర్ ట్యాంక్‌పై ఆ యువతి ప్రమాదకర పరిస్థితుల్లో నిలబడి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ యువతి భీమవరం విష్ణు కళాశాలలో బి.ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతోంది. 15 రోజులకోసారి ఇంటికి రావడం, చదువుపై అంతగా దృష్టి పెట్టకపోవడంపై తల్లిదండ్రులు ఆమెను తరుచూ మందలిస్తున్నారు. భీమవరం నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థిని వైఖరిపై తండ్రి సోమవారం అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విద్యార్థిని తన ల్యాప్ ట్యాప్‌లో సినిమా చూస్తోంది. ఇది గమనించిన ఆమె తండ్రి మందలించి పొలం వెళ్లిపోయాడు. తండ్రి మందలింపులతో మనస్తాపం చెందిన ఆ విద్యార్థిని తన బ్యాగ్ తీసుకుని ఉప్పలగుప్తం నుంచి అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో గల తమ బంధువుల ఇంటికి చేరుకుంది. ఆ బ్యాగ్‌ను బంధువుల ఇంట్లో పడేసి విద్యార్థిని నేరుగా వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లి ట్యాంక్ ఎక్కేసింది. యువతి ఆత్మహత్యాయత్నం చేసుకుంటోందని గమనించిన స్థానికులు తక్షణమే పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో ఆ ట్యాంక్ వద్దకు స్థానికులు చేరుకున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడికి వచ్చారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది తాళ్లు, వలలు కూడా సిద్ధం చేశారు. ఆమెను ట్యాంక్ నుంచి దూకితే రక్షించేందుకు సన్నాహాలు కూడా చేశారు. విద్యార్థినిని ట్యాంక్ దిగాలని అటు స్థానికులు, ఇటు పోలీసులు పదే పదే చెప్పారు. ఇలా గంటకు పైగా సమయం గడిచిపోయింది. ఎట్టకేలకు ట్యాంక్ నుంచి విద్యార్థిని ఏడుస్తూ కిందకు దిగడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సైలు, అగ్నిమాపక సిబ్బంది విద్యార్థిని ట్యాంక్ నుంచి దింపడంతో సఫలీకృతులయ్యారు. విద్యార్థినికి కౌన్సెలింగ్ నిర్వహించి ఆమె తల్లికి అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

భయం గుప్పెట్లో వేట్లపాలెం ప్రజలు

- హత్య కేసులో 20 మంది నిందితులు విడుదల
- పోలీసు పికెట్ కొనసాగించాలని డిమాండ్



వేట్లపాలెం మంగాయమ్మ కాలనీ

సామర్లకోట: వేట్లపాలెంలో గత ఏడాది డిసెంబరు 15న రెండు (కల్దారి, బత్సల) కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు హత్యకు గురి కావడంతో 23 మంది నిందితులను గుర్తించి కేసు నమోదు చేసిన విషయం విదితమే. 23 మందిని కోర్టుకు హాజరు పర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. వీరిలో 20 మంది బెయిల్‌పై సోమవారం సాయంత్రం విడుదల కావడంతో మంగాయమ్మ కాలనీ వాసులు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. కత్తులతో దాడి చేయడంతో కాల్దారి చంద్రరావు(60, కాల్దారి ప్రకాశరావు(55) కల్దారి ఏసు (45) చనిపోయిన విషయం తెలిసిందే. హత్య జరిగినప్పటి నుంచి మంగాయ్మమ్మ కాలనీలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అయితే పోలీసులు తక్కువగా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు. పోలీసులను పెంచి పికెట్ కొనసాగించి గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పడే విధంగా కృషి చేయాలని వేట్లపాలెం గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆ ప్రాంతంలో ఎప్పటికప్పుడు నిఘా ఉండే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరావు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణ భగవాన్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు శాంతంగా ఉండాలని సీఐ రెండు వర్గాలకు సూచించారు.

అగ్ని ప్రమాదానికి పశువుల శాల ఆహుతి

- కాలిపోయిన 4 గేదెలు, రెండు ఆవులు, నాలుగు దూడలు
- రూ.ఐదు లక్షల నష్టం



కాలిపోయిన పశువులను పరిశీలిస్తున్న వైద్యాధికారి, రైతులు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గేదెలు, రెండు ఆవులు, నాలుగు దూడలు పూర్తిగా కాలిపోయాయి. వీటిలో రూ.1.50 లక్షల విలువ కలిగిన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రైతులు, బాధితుల కథనం ప్రకారం వీకే రాయపురం సమీపంలోని మామిళ్లదొడ్డిలోని పశువుల పాకపై విద్యుత్తు వైరు తెగి పడిపోవడంతో మంటలు చెలరేగి పశువుల పాక పూర్తిగా కాలి బూడిద అయింది. ఆ పాకలో ఉన్న పశువులు పూర్తిగా కాలిపోయాయి. మూగజీవాల ఆర్తనాదాలకు సమీపంలో ఉన్న రైతులు పశువుల పాక వద్దకు చేరుకొని మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసి పశువుల యజమాని రంగనాథం వీరభద్రరావుకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం పశువైద్యాధికారి మాకినీడి సౌమ్య ఘటనా ప్రదేశానికి చేరుకొని కాలిపోయిన పశువులను పరిశీలించారు. కాలిపోయిన పశువులు జీవించే అవకాశం లేదన్నారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం ఉంటుందని చెప్పారు. కాలిపోయిన పశువుల ఆర్తనాదాలు రైతుల హృదయాలను కదిలించి వేశాయి. పశువుల పరిస్థితిని చూచి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, రైతు సంఘ నాయకుడు ఇంటి వెంకట్రావులు కంటతడి పెట్టుకున్నారు. వైద్యం అందించినా పశువులు జీవించే అవకాశం లేదని వైద్యాధికారి సౌమ్య తెలిపారు. రెండు పశువులకు మాత్రమే బీమా ఉన్నదని ఆమె చెప్పారు. పశువులకు జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు. వీఆర్వో రైతుల నుంచి సమాచారం సేకరించి తహసీల్దార్‌ను నివేదిక సమర్పించారు.

స్విమ్మింగ్ పూల్‌లో తప్పిన ప్రమాదం

నీట మునిగి సీపీఆర్‌తో బతికిన స్విమ్మర్



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తూ మునిగిపోయి ఓ వ్యక్తి స్పృహ కోల్పోగా స్విమ్మింగ్ పూల్ సిబ్బంది సకాలంలో స్పందించడంలో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే జిల్లా క్రీడామైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 8 నుంచి 9 గంటల బ్యాచ్‌లో శంఖవరం గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్ నెల రోజుల నుంచి కాకినాడ స్విమ్మింగ్ చేస్తున్నాడు. రోజులాగే మంగళవారం కూడా స్విమ్మింగ్ పూల్‌కు వచ్చిన ఆయన ఈత కొడుతున్న సమయంలో ముక్కులోకి నీరు వెళ్లి ఊపిరి ఆడక అస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు, సీనియర్ స్విమ్మర్లు దానిని గమనించి ప్రదీప్‌కుమార్‌ను కొలనులోనుంచి బయటకు తీసి సీపీఆర్ చేసి అంబులెన్సులో దగ్గర ఉన్న ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి ప్రదీప్‌కు ఆస్తమా ఉన్న కారణంగా ఊపిరి సమస్య వచ్చిందని తెలిపి చికిత్సను ప్రారంభించారు. స్విమ్మింగ్ పూల్ వద్ద లైఫ్‌గార్డుల స్థానంలో సీనియర్ స్విమ్మర్లను డీఎస్ఏ అధికారులు కొనసాగిస్తున్నారు. లైఫ్‌గార్డుల నియామకానికి శాప్‌కు లేఖ రాసినా ఇంతవరకు అనుమతి రాకపోవడంతో సీనియర్‌లను కొనసాగించాల్సి వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్‌ను వివరణ కోరగా త్వరలోనే లైఫ్‌గార్డులను నియమిస్తామని తెలిపారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

కాకినాడ క్రైం: కాకినాడలోని జై బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌లో సోమవారం చోటు చేసుకున్న బాణసంచా పేలుడు ఘటనలో క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స కొనసాగుతోంది. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయగా విచారణ కొనసాగుతోంది. మంగళగిరి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ బృందం పేలుడు జరిగిన ప్రదేశంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టింది. పలు నమూనాలు సేకరించింది.

నైతిక విలువలు లేకుంటే ఎన్ని డిగ్రీలు ఉన్నా వృథాయే

- 'నన్నయ' వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- నారీ ఫెస్ట్ 2025 ఉత్సవాలు ప్రారంభం



వెల్ బేబీ షో

రాజానగరం: సమాజంలో నైతిక విలువలు పాటించని వారికి ఎన్ని డిగ్రీలు ఉన్నా వృథాయేనని, వాటికి విలువ కూడా ఉండదని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ మూడు రోజులపాటు నిర్వహించే 'నారీ ఫెస్ట్ 2025' ఉత్సవాలను మంగళవారం ఒక చిన్నారితో జ్యోతిని వెలిగింపజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సభలో వీసీ మాట్లాడుతూ ఆడవారిని ఆకాశంలో సగం, అవకాశాలలో సగం అంటే సరిపోదని, ఆదరించడంలో కూడా సగం కావాలన్నారు. ఆడవారికి ఆదరణే ఆధారమని, ఆ ఆదరణ తల్లిదండ్రుల నుంచి, జీవిత భాగాస్వామి నుంచి, పిల్లల నుంచి లభిస్తుందన్నారు. గతంలో ఆడవారి పట్ల వివక్ష చూపేవారని, ఆధునిక సమాజంలో కొంత మార్పు వచ్చిందన్నారు. ఇదే క్రమంలో రాబోయే కాలంలో వివక్ష లేని సమాజం వైపు అడుగులు వేయాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. తరాలు మారుతున్నా అంతరాలు మారకూడదనే ఉద్దేశంతో బామ్మ – మనుమరాలి షో నిర్వహిస్తున్నామన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే బామ్మలను స్ఫూర్తిగా మార్గదర్శకంగా తీసుకుని ఆమె చేయి పట్టుకుని మనుమరాళ్లు నడుస్తుంటే ముచ్చటగొలుపుతుందన్నారు. పెద్దలను ఎల్లప్పుడూ గౌరవించాలని, వృద్ధాశ్రమాల అవసరం లేని సమాజం వైపు పయనించాలన్నారు.

అలరించిన వెల్ బేబీ షో

బామ్మ – మనుమరాలు షోతోపాటు నిర్వహించిన వెల్ బేబీ షోకు కూడా అపూర్వ స్పందన లభించింది. రాజమహేంద్రవరం పరిసరాల నుంచి తరలివచ్చిన అనేక మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను వేదిక పైకి తీసుకువచ్చి, బుడగలతో పోటీలు నిర్వహించడంలో ఎంజాయ్ చేశారు. అలాగే గ్రూప్ సింగింగ్, గ్రూప్ డాన్స్, ఫ్యాషన్ షో, స్కిట్స్‌లలో పోటీలు జరిగాయి. పరిసరాలలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. ఉమా మహేశ్వరిదేవి, ప్రిసైడింగ్ అధికారి డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ ఎస్.సజనారాజ్, డాక్టర్ కె.దీప్తి, డాక్టర్ డి. లతా, డాక్టర్ బి.విజయకుమారి, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె.నూకరత్నం, డాక్టర్ పద్మావతి, డాక్టర్ కె.రమణేశ్వరి పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో జాతీయస్థాయికి 'లక్ష్య' విద్యార్థులు



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన రిషిత్ రెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈనెల ఒకటో తేదీన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీలలో స్థానిక లక్ష్య ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు నల్లమిల్లి శేషు రిషిత్ రెడ్డి, ఆష్తి వర్థిక శేఖర్ ప్రతిభ చూపి వ్యక్తిగత విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుగుణ మంగళవారం తెలిపారు. జట్టు విభాగంలో రిషిత్ రెడ్డి బంగారు, ఆష్తి వర్థికశేఖర్ రజత, భవ్య సహజ రెడ్డి రజత, బృహతి ఖడ్గ కాంస్య, బి.లక్ష్మీ కృతిక కాంస్య, ఆన్యజైన్ రజత, వర్థిక రజత, కె.నిహాంత్ కాంస్య, విరాజ్ బంగారు, హితేష్ బంగారు పతకాలు గెలుచుకున్నారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, లక్ష్య ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వందన బొహరా, కోచ్ సతీష్ అభినందించారు.

బోటురైడర్, హెల్పర్‌పై హత్యాయత్నం కేసు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బోటులో అనధికారికంగా తీసుకువెళ్లి మళ్లీ సోమవారం రాత్రి తిరిగి వస్తుండగా బోటు తిరగబడి ఇద్దరు మృతిచెందిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు సుబ్బారావుపేటకు చెందిన బెజవాడ సత్తిబాబు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సుబ్బారావుపేటకు చెందిన బెజవాడసత్తిబాబు, సింహాచలనగర్‌కు చెందిన చవల అన్నవరం(54), కాతేరు మిలటరీకాలనీకి చెందిన గాడారాజు(24), కోట రాంబాబు, భవానీపురానికి చెందిన మరికొందరుతో కలిసి కోటిలింగాలరేవు నుంచి సోమవారం మధ్యాహ్నం బోటులో బ్రిడ్జిలంక వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా బోటులోకి నీరు రావడంతో తిరగబడింది.

బస్సులో సూట్ కేసు చోరీ

తస్కరించిన మహిళ నుంచి 117 గ్రాముల బంగారు నగల రికవరీ



రికవరీ చేసిన బంగారు నగలతో అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు, క్రైమ్ సిబ్బంది

అమలాపురం టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న దంపతులకు చెందిన బంగారు నగలతో ఉన్న సూట్ కేసును వారితో ప్రయాణించిన ఓ మహిళ కాజేసిన కేసును అమలాపురం పట్టణ పోలీసులు ఛేదించారు. దాదాపు రూ.6 లక్షల విలువైన 117 గ్రాముల బంగారు నగలను ఆ మహిళ నుంచి రికవరీ చేయడంతోపాటు ఆమెను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈ కేసు వివరాలను ఆయన వివరించారు. గత నెల 17వ తేదీన విశాఖపట్నం జిల్లా కూర్మన్నపాలేనికి చెందిన దుర్గమ రామకృష్ణ దంపతులు కాకినాడ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అమలాపురం నాన్ స్టాప్ బస్సు ఎక్కారు. బస్సులో రామకృష్ణ భార్య పక్కనే ఓ మహిళ కూర్చుంది. బస్సులో కాళ్ల దగ్గర బంగారు నగలతో ఉన్న సూట్ కేసును ఆ దంపతులు పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఆ మహిళ ముమ్మిడివరంలో దిగిపోయింది. రామకృష్ణ దంపతులు అమలాపురంలోని తమ బంధువులు ఇంటికి వెళ్లిన తర్వాత బస్సులో సూట్ కేసు పోయినట్లు గుర్తించారు. ఆ సూట్ కేసులో ఒక బంగారు తెల్ల రాళ్ల నక్లెస్, ఎరుపు ఆకుపచ్చ రాళ్ల బంగారు నక్లెస్, బంగారపు ఆకు పచ్చ రాళ్ల నక్లెస్, రెండు బంగారపు లాకెట్లు మొత్తం 117 గ్రాముల బంగారు నగలు ఉన్నట్లు అదే రోజు పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రామకృష్ణ పేర్కొన్నారు. బస్సులో తన భార్య చెంతన కూర్చున్న మహిళపైనే తమకు అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో రాశారు. ఈ కేసును డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ వీరబాబు, క్రైమ్ ఎం.గజేంద్రకుమార్ పర్యవేక్షణలో పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్ బాబు, క్రైమ్ సిబ్బంది లోతుగా దర్యాప్తు చేశారు. ఆ రోజు బస్సులో బంగారు నగలతో ఉన్న సూట్ కేసును గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం ఎర్ర చెరువు గ్రామానికి చెందిన ఆవుల యశోద దొంగిలించినట్లు తమ దర్యాప్తులో పోలీసులు గర్తించారు. అమలాపురం ఆర్టీసీ బస్సు స్టేషన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న యశోదను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి 117 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. దొంగను రెండు వారాల్లో అరెస్ట్ చేయడమే కాకుండా నూరు శాతం సొత్తును రికవరీ చేసిన సీఐలు వీరబాబు, గజేంద్రకుమార్, ఎస్సై కిషోర్‌బాబు, క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ చోరీలో మహిళా దొంగ యశోదకు సహకరించిన మరో నిందితురాలిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వీరబాబు తెలిపారు.